రోడ్లా.. నీటి గుంతలా..?

- అధ్వానంగా పల్లె రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

భూదాన్‌పోచంపల్లి : ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పలు గ్రామాలను కలిపే లింక్‌రోడ్లన్నీ గుంతలమయంగా మారి ఆనవాళ్లు కోల్పోయాయి. వర్షపు నీరు రోడ్డుపై ఏర్పడిన గుంతలలో చేరడంతో గుంతలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వాన రోడ్లు ఇవే..

పోచంపల్లి నుంచి సీతావానిగూడెం, నారాయణగిరికి వెళ్లే మార్గంలో ఏర్పడిన గుంతలో నీరు చేరి మడుగులను తలపిస్తున్నాయి. ఈ మార్గంలో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అలాగే భీమనపల్లి జిబ్లక్‌పల్లి, రేవనపల్లి నుంచి పెద్దరావుల పల్లి, కప్రాయిపల్లి నుంచి జూలూరు రోడ్లు అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జూలూరు నుంచి వయా అలీనగర్ పెద్దగూడెం రోడ్డు, పెద్దగూడెం నుంచి పిలాయిపల్లి వరకు గల రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైన పనులు సాగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆరు నెలల క్రితం కంకర, డస్ట్ పోసి, మట్టిపోసి వదిలేశారు. దీంతో నిత్యం ఈ మార్గంగుండా వెళ్లే వాహనాల దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


నారాయణగిరి సమీపంలో అధ్వానంగా మారిన రోడ్డు


జిబ్లక్‌పల్లి సమీపంలో రోడ్డు దుస్థితి


పోచంపల్లి శివారులో..

ఇబ్బందులు పడుతున్నాం



జూలూరు అలీనగర్ పెద్దగూడెం రోడ్డుపై కంకర, డస్ట్‌పోసి ఆరు నెలలు అయ్యింది. ఎవరు పట్టించుకోవడం లేదు. పనులు కూడా చేస్తలేరు. లారీల దుమ్ముతో రోడ్డు పక్కనే ఉన్న మా షాపులోకి దుమ్ము వస్తుంది. చిన్నపాటి వర్షం కురిసిన బురదమయంగా మారడంతో ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరతున్నాం.

– ముప్పిడి లావణ్య, జూలూరు

మరమ్మతులు చేపట్టాలి



కప్రాయిపల్లి నుంచి జూలూరు రోడ్డు బురదమయంగా మారి చాలా ఇబ్బంది పడుతున్నాం. వర్షపునీరంతా రోడ్ల పైన చేరడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా మూసీ కాలువ సమీపంలో అరకిలోమీటర్ మేర రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

– బోదాసు శ్రీరాములు, కప్రాయపల్లి

ఇందిరమ్మ ఇళ్ల పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

యాదగిరిగుట్ట రూరల్: ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం మండలంలోని మాసాయిపేటలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పరిస్థితులు, బిల్లులకు సంబంధించిన వివరాలతో ఇటుక, స్టీల్, సిమెంట్ తక్కువ ధరకు ఇస్తున్నారా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు చేశారా, బియ్యం తెచ్చుకుంటున్నారా, ఉచిత కరెంటు వస్తుందా అనే విషయాలు ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబధిత అధికారులను ఆదేశించారు. తప్పులకు తావు లేకుండా, చూడాలని, బిల్లులు సకాలంలో అందేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండీ యాకుబ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ నసీరుద్దీన్, క్లెం జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.


మాసాయిపేటలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

గీత కార్మికులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

ఆత్మకూరు(ఎం) : గీత కార్మికులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పీఎస్ గార్డెన్‌లో జరిగిన 6వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కల్లు గీత కార్మికుల సంక్షేమాన్ని పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గీత వృత్తి దారులకు కాటమయ్య రక్షణ కిట్లను అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాకు నిధులు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు పంజాల నర్సయ్య అధ్యక్షతన జరిగిన మహాసభలో జిల్లా అధ్యక్షుడు రాగిర్ కృష్ణయ్య, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, నాయకులు బీసు చందర్ గౌడ్, గడ్డం దశరథగౌడ్, చెరుకు మల్లేశం గౌడ్, రంగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొలగాని జయరాములు

రోడ్డు వెంట వాహనాలు పార్కింగ్ చేయొద్దు

చౌటుప్పల్ రూరల్: రోడ్ల వెంట వాహనాలు పార్కింగ్ చేయొద్దని సీఐ మన్మథకుమార్ అ న్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయ న మాట్లాడుతూ జాతీయ రహదారి–65 వెంట వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారిపై వాహనాలకు కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే పార్కింగ్ చేయాలన్నారు. జాతీయ రహదారి వెంట పార్కింగ్ చేసిన 4 డీసీఎంలు,రెండు ట్రక్కులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనదారులు కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో మాత్రమే రాత్రి, పగలు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో చెరువు అలుగు వద్ద బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో పూలు చల్లి, కొబ్బరికాయలు కొట్టి, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరులో దాదాపు అన్ని చెరువులు పూర్తిగా నిండాయన్నారు. గతంలో కంటే సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల అధ్యక్షులు మంగ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఎడ్ల సుగుణ రాంరెడ్డి, దుంబాల వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

ఆలేరు: పట్టణంలోని రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద చేపట్టిన రోడ్డు పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని రైల్వే గేట్ చౌరస్తాలో జరుగుతున్న ఆయూబీ పనులను ఆయన పరిశీలించారు. ఆర్అండ్‌బీ డీఈతో ఫోన్‌లో మాట్లాడి పనుల వివరాలు తెలుసుకున్నారు. ఆర్‌యూబీ మట్టి రోడ్డుతో రాకపోకలకు ఇబ్బంది అవుతున్నందున, బీటి లేదా అవకాశముంటే సీసీ రోడ్డు వేయాలని సూచించారు. అంతకుముందు కాటమయ్యనగర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. లబ్ధిదారుడు కరుణాకర్ వ్యక్తిగతంగా రూ.1లక్ష సాయాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎంఏ.ఇజాజ్, తదితరులు పాల్గొన్నారు.


కాచారం చెరువు అలుగు వద్ద పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలి

భూదాన్‌పోచంపల్లి : విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మద్దిలేటి పసుపుల అన్నారు. బుధవారం మండలంలోని జలాల్‌పురం గ్రామంలో పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్–1, యూనిట్ –2 ఆధ్వర్యంలో ప్రత్యేక వానాకాలం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ జెండావిష్కరణ చేశారు. విద్యార్థులతో కలిసి ప్రభుత్వ పాఠశాలను ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి నాయకత్వ లక్షణాలు పెంపొందడానికి ఎన్ఎస్ఎస్ శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. గ్రామాభివృద్ధిలో విద్యార్థులు పాలుపంచుకోవాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి. సురేశ్‌రెడ్డి, పంచాయతీసెక్రటరీ నవీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జ్యోతి, సాయివర్ధన్, స్టూడెంట్ కౌన్సిలర్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు తులసి, రాజేశ్వరమ్మ, శివశంకర్, వెంకటేశ్, వెంకట్‌రెడ్డి, రేణుకాదేవి, స్వాతి, చందన, ప్రవీణ్ కుమార్, గ్రామపెద్దలు పాలకూర్ల ఆగయ్య, గోరంటి ప్రదీప్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, నక్క శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శాపాక రాజు, గుండ్ల మహేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మద్దిలేటి పసుపుల

కొనసాగుతున్న బతుకమ్మ సంబరాలు

భువనగిరిటౌన్ : పట్టణంలోని సుందరయ్య భవన్‌లో బుధవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలు పాడి ఆడారు. ఈ కార్యక్రమంలో వనం ఉపేందర్, కొత్త లలితా, కొండాపురం మనోహర, బర్ల పార్వతి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని పో చంపల్లి కో ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు ప్రధా న కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3గంటలకు బ్యాంకు సర్వసభ్య సమావేశాన్ని బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి


ఆలేరు : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ యాలాద్రి


ఆరెగూడెంలో మాట్లాడుతున్న సీఐ శంకర్

ఆలేరు: నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని సీఐ యాలాద్రి అన్నారు. బుధవారం ఆలేరు పట్టణంలోని బృందావన్ కాలనీలో నేరాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన ఆయన పాల్గొని మాట్లాడారు. దసరా పండుగకు ప్రజలు ఊరికెళ్తే బంగారం, నగదు బ్యాంకు లాకర్లలో దాచుకోవాలన్నారు. కాలనీల్లో అనుమానితులు కన్పిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కాలనీలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అవగాహన సదస్సులో ఎస్ఐ వినయ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం

యాదగిరిగుట్ట రూరల్ : నేరాలను నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్ గౌడ్ అన్నారు. బుధవారం మోటకొండూర్ మండలంలోని ఆరెగూడెంలో సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దొంగతనాలు, డ్రగ్స్, బెట్టింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, మాణిక్యం, పేరబోయిన కార్తీక్, ఎల్లయ్య, కర్ణాకర్, శంకర్, రమేష్, రాములు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా రాజీవ్ స్మారక ట్రస్ట్

చౌటుప్పల్ రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రాజీవ్ స్మారక ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎంఎ.ఖయ్యూం అన్నారు. ఇటీవల మృతి చెందిన మండలంలోని చిన్నకొండూర్ గ్రామానికి చెందిన ఎలకరాజు సత్యనారాయణ, దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన ఎస్.కె రంజాన్ కుటుంబాలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15 వేల చొప్పున బుధవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు బక్క శ్రీనాథ్,నాయకులు నల్ల నర్సింహ, దోర్నాల శ్రీనివాస్, తీగుళ్ల బాలరాజు, చంద్రయ్య, వరకాంతం జంగారెడ్డి, పన్నాల రాజిరెడ్డి, వర్కాల మహేందర్, సురుగు శ్రీనివాస్, సాయికుమార్, గడ్డం సత్తయ్య, మైసయ్య పాల్గొన్నారు.

హోమియో మందులు పంపిణీ

చౌటుప్పల్ : సహస్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులకు హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ చినుకని శివప్రసాద్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులు రాకుండా హోమియో మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారుఅ కార్యక్రమంలో ఏసీపీ పటోళ్ల మదుసూధన్ రెడ్డి, సీఐ మన్మథకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి

మోత్కూరు: చేనేత సహకార సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ దుడుక ఉప్పలయ్య కోరారు. బుధవారం గుండాల మండల కేంద్రంలో ఆ సంఘం 32వ సాధారణ మహా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సంఘాలపై ఉన్న జీఎస్టీని రద్దు చేస్తూ సభ్యత్వాలు పొందిన ప్రతి కార్మికుడికి పని కల్పించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న భవనానికి నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని, నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. మండల కేంద్రంలో 50 మంది కార్మికులకు సరిపడా వసతులను ఏర్పాటు చేసి పనులు కల్పించాలన్నారు. చేనేత సహకార సంఘాలకు గత 7 సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించక పోవడంతో చేనేత సహకార సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని వాపోయారు. అనంతరం చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ త్రిఫ్ట్ ఫండ్ పథకంలో ఉన్న 200 మంది సభ్యులకు రూ.2.40 కోట్లను వారి ఖాతాలలో ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీఓ సత్యనారాయణ, పర్సన్ ఇన్‌చార్జ్‌లు చుంచు యాదగిరి, బిట్ల ఉమారాణి, కూరపాటి రవి, సామల ఉప్పలయ్య, చుంచు నర్సమ్మ, సిబ్బంది సత్యనారాయణ, రమేష్, సోమేశ్వర్, గోపాల్, మధు, చిందం ప్రకాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసరావు

భర్త వేధింపులపై నిరసన

భువనగిరిటౌన్ : అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురి చేస్తున్నాడని న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్ దమ్మాయిగూడకు చెందిన మహిళ బుధవారం పట్టణంలోని తన భర్త మణిదీప్ ఇంటి ఎదుట కూర్చుని నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెళ్లైన పది రోజుల నుంచే తనను వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించింది. దసరా అనంతరం రెండు కు టుంబాలతో మాట్లాడుతామని పోలీసులు నచ్చ చెప్పడంతో ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయింది. కోడలు చెప్పేదంతా అబద్ధాలు అని, మా పరువు తీసేందుకేనని మణిదీప్ తల్లిదండ్రులు వాపోయారు.

27న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి పీఏసీఎస్ అర్ధ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 27న ఉదయం 11 గంటలకు పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ సద్దుపల్లి బాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సకాలంలో హాజరు కావాలన్నారు.

అన్నపూర్ణా దేవిగా అమ్మవారు


ఆత్మకూరు(ఎం)లో పూజలు చేస్తున్న భక్తులు


యాదగిరిగుట్ట రూరల్: వంగపల్లిలో పూజలు చేస్తున్న వీర తెలంగాణ యూత్ సభ్యులు


రామన్నపేట : వెల్లంకిలో ..


మోత్కూరులో పూజలు చేస్తున్న భక్తులు


రాజాపేట : రేణికుంటలో..


సంస్థాన్ నారాయణపురం: జనగాంలో..


బీబీనగర్ : వేణుగోపాలస్వామి ఆలయంలో నెలకొల్పిన అమ్మవారి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

విద్యుత్ లైన్ వేయొద్దని వినతి

రామన్నపేట : రామన్నపేట సుభాష్ రోడ్డు వెంట 33/11కేవీ విద్యుత్‌లైన్ వేయొద్దని వర్తకసంఘం ప్రతినిధులు బుధవారం ట్రాన్స్‌కో అధికారులు, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. రోడ్డు ఇరుకుగా ఉందని, విద్యుత్ టవర్ల నిర్మాణంతో ఇళ్లకు విద్యుత్‌షాక్ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వర్తకసంఘం అధ్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వరాచారి, ప్రధానకార్యదర్శి వహీద్, రాపోలు రాజశేఖర్, కె.రాంబాబు, గుండాల అంజయ్య, కట్కూరి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మతం పేరుతో బీజేపీ రాజకీయాలు

వలిగొండ : మతం పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని సీపీఎం రాష్ట్ర నాయకుడు బండారు రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగంలో మత స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందన్నారు. కానీ దాన్ని రాజకీయాలకు వాడుకోవద్దన్నారు. మతం వేరని రాజకీయాలు వేరని దృష్టిని మర్చిపోయి పాలకులుగా ఉన్న వారే మతాన్ని రాజకీయాలకు ముడి పెట్టడం దుర్మార్గమన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ విధానాలను ప్రజలు తిప్పికొట్టాల ని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాటూరి బాలరాజు, కవిడే సురేష్, సిర్పంగి స్వామి, మద్దెల రాజయ్య, గణపతి రెడ్డి,ఈర్లపల్లి ముత్యాలు, మెరుగు వెంకటేశం,కూర శ్రీనివాస్,వాకిటి వెంకటరెడ్డి, కందడి సత్తిరెడ్డి, గాజుల ఆంజనేయులు కల్కూరి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

కమిటీ రద్దు చేయాలని వినతి

మోత్కూరు : ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఎంపిక మండలంలోని పాడిచేడు లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీని రద్దు చేయాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దీటి సందీప్, రవి, కనకయ్య, వెంకటేష్, పాల్గొన్నారు.

కబడ్డీలో రాణించి.. ఖ్యాతిని చాటాలి


కబడ్డీ జిల్లా జట్టు

ఆలేరు: నిజామాబాద్ జిల్లా ముక్కాల్‌లో ఈ నెల 25, 26, 27, 28 తేదీల్లో అండర్–16 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన యాదాద్రిభువనగిరి జిల్లా బాల, బాలికల జట్లు బుధవారం ఆలేరు నుంచి జామబాద్‌కు బయలుదేరి వెళ్లాయి. క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు గడసంతల మధుసూదన్, మాదాస్‌జోసెఫ్, రమేష్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై జీఎస్టీ ఎత్తివేయాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భువనగిరిటౌన్ : పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలపై జీఎస్టీ ఎత్తివేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రైతు బజార్ వద్ద పెట్రోల్, డీజిల్, గ్యాస్, బంగారం, వెండిపై జీఎస్టీ ఎత్తి వే యాలని కోరుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యవర్గ సభ్యులు బందెల ఎల్లయ్య, అంజయ్య, గిరి, లక్ష్మయ్య, పద్మ పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు మాజీ సర్పంచ్ పడాల సతీష్‌చారి ఆధ్వర్యంలో నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందెకార్ రాంలాల్, సాబేర్ ఖాన్, సురేశ్, రాజు, శ్రీరామ్, బిట్టు, అఖిల్, సిద్దు, సన్నీ, రాకేశ్, ఆర్యన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

భువనగిరి : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భువనగిరి మండల నూతన కమిటీని బుధవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఏన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పసల రోమన్, ఉపాధ్యక్షులుగా బాలనర్సింహ, వెంకటనర్సు, ప్రధాన కార్యదర్శిగా వల్లందాసు సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా ఉడుత సత్యనారాయణ, కోశాధికారిగా సీహెచ్ ఆరోగ్యయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పర్యవేక్షకులు దశరథ, నాయకులు జయరాజు, జనార్దన్, బిక్షం రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

మోత్కూరు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సమావేశాన్ని బుధవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గార్లపాటి సోమిరెడ్డి, అధ్యక్షుడిగా బద్దం యాదిరెడ్డి, కార్యదర్శిగా ఆకవరం వల్లభాయ్, కోశాధికారిగా వారాల యాదగిరి, అసోసియేట్ అధ్యక్షులుగా జె.రాజబోస్, ఉపాధ్యక్షులుగా తొగిటి మనోహరాచారి, ఎస్.యాదగిరిలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బి.రాంరెడ్డి, పరకాల నర్సయ్య, బి.నర్సయ్య ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా, బి.వెంకటేశ్వర్లు ప్రచార కార్యదర్శిగా, జిల్లా ప్రతినిధులుగా ఎలగందుల సత్యనారాయణ, అండెం వెంకట్‌రెడ్డి, సూరోజు భాస్కరాచారిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

సంచార జాతుల సంఘం కమిటీ..

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో తెలంగాణ సంచార జాతుల సంఘం కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నబత్తిని బుడ్డ యాదగిరి, మహిళా అధ్యక్షురాలిగా చెన్నబత్తిని కాంతమ్మ, ప్రధాన కార్యదర్శిగా సేని సతీష్, కోశాధికారిగా కంసాని యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సరికొండ రవితేజ, ఉపాధ్యక్షులుగా పోవానపు శ్రీనివాస్, పర్వతం రమేశ్, గౌరవ అధ్యక్షులుగా పర్వతం రంగయ్య, రేవెల్లి సాలయ్య, పర్వతం నర్సింహ, చెన్నబత్తిని ఆనంద్, ఆశోక్ మల్లారి, సంయుక్త కార్యదర్శిగా చెన్నబత్తిని సారయ్య, యూత్ అధ్యక్షునిగా పిన్నపురాళ్ల సమ్మయ్య ఎన్నికయ్యారు.

నేడు వైద్యశిబిరం

మోత్కూరు : స్వస్థనారీ.. స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మోత్కూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు వైద్యాధికారి పి.హేమంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు స్కిన్, డెంటల్, సైకియాట్రిస్ట్, ఈఎన్‌టీ, స్పెషలిస్టులతో క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముర్రుపాలు తాగించాలి

మోత్కూరు : పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగించాలని సీడీపీఓ జ్యోత్స్న అన్నారు. గుండాల మండలంలోని అంబాల అంగన్‌వాడీ–2 కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం, తల్లి పాల ప్రాధాన్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షమీమ్‌భేగం, ఏఎన్ఎం దేవేంద్ర, అంగన్‌వాడీ టీచర్ చింత వసుమతి, తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్లకు నోటీసులు

మోత్కూరు : గుండాల మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సుద్దాల గ్రామంలో నిర్మించ తలపెట్టిన పెట్రోల్ బంక్ నిర్మాణంపై వచ్చిన అభియోగాలపై వివరణ ఇవ్వాలని కోరుతూ మంగళవారం పీఏసీఎస్ డైరెక్టర్లకు ప్రభుత్వం నోటీసులు అందజేసింది. సంఘం కార్యవర్గ సభ్యులు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే లావాదేవీలలో ప్రత్యక్షంగా ఎలాంటి ఒప్పందాలు చేసుకోకూడదని సంఘం డైరెక్టర్ వై.విద్యాసాగర్‌రెడ్డికి సివిల్ వర్క్‌పై ఇచ్చిన తీర్మానం పూర్తిగా చట్ట విరుద్ధమని నోటీసులు అందజేశారు.

కేంద్ర పథకాలపై అవగాహన

మోత్కూరు : ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ కార్యక్రమంలో భాగంగా గుండాల మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈడీసీ మేనేజర్ కుమ్మరికుంట్ల రంజిత్‌కుమార్, ట్రైనర్ హేమాద్రి, లీడ్ బ్యాంకు ఆఫీసర్ వంశీ, రేణుక, ఏపీఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి మునావర్, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ మహేష్, వాసుదేవ్, గీత పాల్గొన్నారు.

వీధి లైట్ల ఏర్పాటు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని భీమనపల్లి గ్రామంలో గత కొంతకాలంగా వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం గ్రామానికి చెందిన సుమన్‌రెడ్డి రూ.13,500 ఖర్చు చేసి గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు లైట్లను వేయించారు. వీధి లైట్లు వేయించిన సుమన్ రెడ్డి పలువురు గ్రామస్తులు అభినందించారు.